# శూన్యం

రచన:
మునిపల్లెరాజు

ఇన్నాళ్ళూ—తన జీవితాన్ని అంచులులేని తమస్సుతో పోల్చుకొన్నాడు. "తమస్సులో పుట్టాను. పెరిగాను. కుంగిపోతున్నాను." అని దినదినమూ తనిపోని ఆవేదనను కొని తెచ్చుకొని తన ఏకాంతంలో ఏడ్చేవాడు. ఉదారమైన ఆశయాలు, కళాశోభితమైన జీవితానుభవాలు—యివి ఎక్కడ లభిస్తాయాయని యీ యిరవై నాలుగేళ్ళలోనూ, లోకపుమూల మూలలనన్నీ గాలించి వదిలేశానని అనుకుంటూన్న తన విశ్వాసం—అన్ని పరీక్షల్లోనూ నిరాశను మాత్రమే పోగుచేసిందని వాపోయేవాడు. తనో మంచివని నమ్మిన గొప్పలక్ష్యాల కోసం వస్తు ప్రపంచంలోని విలువైన బ్రదుకును, చదువునూ, ఉద్యోగాన్ని, భోగాలను కాలతన్నేశానని అహర్నిశలూ విచారిస్తూన్నాడు. అవును, యిరవైనాలుగేళ్లు వెతికితే దొరికిన శూన్యం తనవంటి గొప్పరచయితను తన రచనల ద్వారా ఆర్జించిన దారిద్ర్యాన్ని గాయపరచకుండా మాయమౌతుందా?—అని పశ్చాత్తాపంలో తప్తుడౌతున్నాడు. ఆలోచనలతో—భౌతిక ప్రపంచంలో నీటుగా బ్రదకాలన్న సామాన్య విషయాన్ని గూడా మరిచిపోతాడు. యిప్పుడు కథలూ, గీతాలు, పుస్తకాలూ వ్రాయలేడు. చీకటిని ప్రేమించలేడు. గొంతెత్తి పాడలేడు. సినిమాలు చూడలేడు. తనిప్పుడు గొప్పసత్యాన్ని త్రవ్వితీసిన వేత్తనని అప్పుడప్పుడు మాత్రం అనుకుంటూంటాడు. నెలకుయాభై రూపాయల ఉద్యోగంలో "రొటీన్"గా బ్రదకటానికి అలవాటుపడ్డాడు. హోటల్లో తింటాడు. గదిలో పడుకొంటాడు. ఆఫీసు గంటలు, ఒక్కటే జ్ఞాపకమున్న గొప్పసంగతి అంతా మరిచాడు. చీకట్లోనే నిద్రించి, వెలుగులో మేల్కొని, ఆకలిని చల్లార్చుకొని—చచ్చిపోయే వుపాయం తెలీక బ్రదుకుతూన్న జీవి అతడిప్పుడు.

* * *

రాత్రివచ్చిన వుత్తరం గొప్ప విప్లవాన్ని తెచ్చిపెట్టింది. తన రచనలు బాగున్నాయని అప్పుడప్పుడు వచ్చే వుత్తరాల్లో—యీ ప్రత్యేకమైన వుత్తరానికి ఏదో భావకందని విశిష్టతవుంది. తనతో పోల్చుకోవటానికి యీ లోకంలో ఏదైనా జీవి, వస్తువు, అవకాశం, ఆధారం, ఆశ, నిరాశ—దొరుకుతుందేమోనని, తను తనకు తెలీకుండానే చేసిన ప్రయత్నం యొక్క ఫలసిద్ధిలాగా యీ వుత్తరం వచ్చింది. తనవలెనే తమస్సు ఆవరణలో కళ్ళున్న వ్యక్తియొక్క శూన్య బాంబులాగా యీ వుత్తరం ప్రతివారమూ వస్తున్నది. ఒక్కొక్కసారి వారానికి రెండువస్తాంటాయ్ గూడా. తను మరిచిపోయాననుకొన్న ఎన్నో విషయాలు, వెనకటి రోజులతో దొర్లిన అనంత ఆలోచనలు—తిరిగి స్మరణకు తేగలిగిన అజ్ఞాత శక్తితో, గతాన్ని, వర్తమానాన్ని, భావిని వేరుచేసి చూపగలిగిన విశిష్టతతో—యీ వుత్తరాలు తనను ప్రతిక్షణమూ ఆకర్షిస్తున్నాయి. చాలా గొప్పవింత తను అనుభవిస్తూన్న శూన్యంలో సైతం, ఏదో లోపమున్నదని గుర్తుకువచ్చినప్పుడు తను అనుభవించే నూత్న విచారం, విరిగిన గుండెలోని గాయాలను లెక్కపెట్టే భయంకర రాత్రులు యిప్పుడు క్రమంగా అదృశ్యమౌతున్నట్లుగా తోచింది. తని అశక్తుడై విచారంతో పోరాటం మానివేసి వెన్నుజూపాడు—కాని మళ్ళీ యీ అజ్ఞాత వ్యక్తి తవ వుత్తరాలనే, నిశితఖడ్గాలను తనకండగా నిలిపి—పోరాటాన్ని సాగిస్తున్నది. ఎంత ఆశ్చర్యం? ప్రతి

వుత్తరాన్ని ఒకసారికి నాల్గుసార్లు, కొన్నింటిని డజను సార్లు, కొన్నింటిని నిశ్శేషంగా చదివాడు. యీ 24 ఏళ్ళ తమస్సులో శూన్యం కాదు వెతికింది. తను లక్ష్య విదూరుడై తిరగలేదు. తను ఆ తమస్సులో తపస్సు చేశాడు. అవును, తమస్సులో తపస్సు!!

ఒక్క వుత్తరానికీ జవాబు వ్రాసి ఎరగడు. తన జీవితంలో, తను జాగ్రతతో గుర్తించిన ఒకానొక అవ్యక్తలోపాన్ని కానరానీయకుండా కమ్మివేసిన వుత్తరాలు యిచ్చిన తృప్తి అతడికి, జవాబు వ్రాయాలన్న ధర్మాన్ని భోధించలేదు. కాని ఆ తృప్తిలోనే ఏదో అసంతృప్తి, ఆ వ్యక్తిని చూడాలన్న, యిన్నాళ్ళూ మృగ్యమైన వాంఛ. తిరిగి అశాంతిని కొనితెస్తున్నట్లుగా భావాలు అల్లుకొంటున్నాయ్. యిట్లా ఆ భావాలను పరుచుకోనిస్తే తను నిర్మించుకొన్న శాంతి కూలిపోతుందేమో! బ్రదకాలన్న వాంఛను, మేల్కొవాలన్న వుద్రేకాన్ని, తలదువ్వుకోవాలన్న చిన్నకోర్కెను, వెన్నెల్లో పాడాలన్న ఆవేదనను, వ్యధిత హృదయంతో జీవితం పొడుగు తగ్గిపోతున్నదన్న సత్యాన్ని, లావా ప్రవాహానికి అడ్డుకట్ట నిర్మించాలన్న మెరుపు సంకల్పాన్ని రాత్రిని రాత్రిగా, పగటిని పగలుగా దర్శించమని చేసిన వుద్బోధాన్ని—ఏ వుత్తరాలు కొనితెచ్చాయో ఆ వ్యక్తి సౌందర్యం, ఆ వ్యక్తి మూర్తి—ఏమూల వున్నదో గవేషించాలన్న ఆతృత మనస్సులో, సంధ్యలో, ఆత్మలో, హృదిలో ఆటలాడుతోంది. ఎంత చక్కని భావాలు ఎంత అందమైన కలలు ఏలోకపు వాతావరణం? —అనుకొన్నాడు—హోటలునుండి తిరిగివస్తూ చాలా అందమైన యువతియొక్క వ్యక్తమైన భావాలన్న—బలంలేని అనుమానం, బరువైన

స్థాపితము: 1916

చారి & రామ్

[రంగులు, రసాయన ద్రవ్యాల దిగుమతీదార్లు]

హెడ్ ఆఫీస్: మధుర

బ్రాంచీలు, స్టాకిస్టులు ఇండియా అంతటా వున్నాయి.

| | |
|---|---|
| చీరాలలో ప్రతినిధి:<br>శ్రీ టి. వి. రాజగోపాల్,<br>మెయిన్ రోడ్. | రాజమండ్రిలో స్టాకిస్టులు:<br>బాబా కల్చర్ ట్రేడింగ్ కంపెని |
| సికంద్రాబాద్‌లో స్టాకిస్టులు:<br>శ్రీ హనుమాన్ కల్చర్ ట్రేడింగ్ కంపెని<br>1809, మహంకాళి వీధి. | ఆదోనిలో స్టాకిస్టు:<br>శ్రీ కల్మంగి మహాదేవప్ప,<br>షరాబ్ బజార్. |

అడుగులు వేస్తూంటే బలపడసాగింది. చీకట్లో ఆగి చిరునవ్వు నవ్వాడు. తనకే తెలీదు ఎందుకో.

* * *

ఒక్క పరుగులో గదిచేరాడు. గదితలుపులకు తాళం వేయలేదన్న సంగతి ఎంత అలస్యాన్ని నాశం చేసింది? విధిఅనే వారాశి ఒకటివుంటే, అది యీ ఆంధ్యంలో తనను కెరటాలపై తేలి యాడిస్తున్నది!

బల్లమీది చిందర వందరగా శాపురు మంటూన్న వుత్తరాలు సరిగా అమర్చి, ఆ అవ్యక్త "యువతి" యొక్క చిరునామాకోసం గాలించాడు పది—పన్నెండు—పదిహేను వుత్తరాల్లో ఎక్కడా అవుపించలేదు. పదహారో వుత్తరాల్లో "వ్యక్తి" అన్న మామూలు సంతకానికి బదులు "సావిత్రి" అన్న చక్కని సంతకంవున్నది. నిన్నవచ్చిన వుత్తరంలో జిలుగు అక్షరాల చిరునామాగూడా వుంది.


మహాభల్లాతకి లేహ్యాము

సమస్త కుష్టములను సమూలముగా
నాశనమొనరించు దివ్యౌషధము.

పొడలు. కొరకములు, మేహరోగములు, గ్రంథులు మొదలగునవి 10 మోతాదులలో నివారణమగును.

40 దినములకు సరిపోవు మందు రూ. 8-0-0
అనుపాన కషాయము రూ. 4-0-0

మోచాకంద రసాయనము

మలబద్ధకము, ఆసనమునందు దురద, బైటకు వెళ్లునపుడు రక్తముపడుట, మొలకలు మొదలగు సర్వవిధముల మూలములను కుదుర్చును.

20 తు॥ డబ్బా రూ. 3-0-0.

ఆర్య వైద్య మందిరం,
(డా॥ డి. నరసింహాచార్యులు)
ఈగవారిపాలెం (P. O. చెంగల్పట్టుజిల్లా.


తన బుద్ధి ఎంత తీక్షణమైనది — సూక్ష్మమైనది — ఆ వ్యక్తి నిజంగా ఒక యువతి! "సావిత్రి"ట, ఎంత చక్కటిపేరు. పాతకూ, కొత్తకూ మధ్యనిలిచిన సంధ్యలో ప్రత్యూషస్సులాగా, తన శిలారూపాన్ని చిగిర్పించి పిలుస్తోంది. సావిత్రి! నిరాశ ఘూమకెరటాల్లో అలముకొన్న "తను" అనబడే మృతశిల, ఏదో స్వర్గధామానికి లేతకొమ్మలతో మెట్లు నిర్మిస్తున్నది!

మూడు గంటలు కూర్చొని రాశాడు వుత్తరం. తన జీవితంలో ఎప్పుడూ అట్లా రాయలేదు. తను రాసిన సారస్వతంలో ఒక అజరామర స్థానాన్ని ఆక్రమించుకోగల గొప్ప గాంధర్వుల వుత్తరం తను చచ్చిపోయినా, తన వుత్తరం లోకంలో చుక్కవలె మెరుస్తుందిట. కాని—ఏమిరాశాడో అని కవరు మూశాక స్మృతికితెచ్చుకో ప్రయత్నించాడు. లాభించలేదు. ఆ తృప్తితో సెలవులేకుండా ఆఫీసుకు మూడురోజులు పోలేదు. నిద్రమాత్రం పోయాడు. నాల్గవరోజు సాయంత్రం జ్ఞప్తివచ్చి, బిళ్ళలేని కవరును పోష్టులో వేశాడు.

ఆరురోజుల వరకు ఏదో తృప్తి చెన్నాడగా, ఏదో మధురబాధ పలకరించగా, ఏదో శర్వరీశాంతి యిచ్చిన*ఆనందం కళ్ళను చెమ్మగిలచేయగా జవాబు వచ్చింది.

జవాబు వచ్చింది!

జవాబు వచ్చింది!!

అందమైన జవాబు!!!

"వస్తున్నాను. రేపు వుదయం ప్యాసెంజరులో సావిత్రి"

* * * *

భౌతికంగా అక్కడలేని సావిత్రి, రేపు వచ్చేసావిత్రి గదినంతా శుభ్రం చేయమని చెప్పింది. ఓపికతో దుమ్మునంతా దులిపాడు. పుస్తకాలు దొం

తర్లుగా ఏర్పడ్డాయి. వుత్తరాలు ఎర్రట్టల ఫైలులో గొంతులు నుచ్చుకొన్నాయ్. నందలాలు బోసు బొమ్మలు గోడలమీద తళతళలాడాయ్. క్యాలెండరు ఆరునెలలు వెనకబడి ఒక్క క్షణంలో ఆరు నెలలూ ముందుకు నడిచింది. బల్లమీది నల్లగుడ్డ మారి, పువ్వులు మొలిచిన సన్నగుడ్డ ఆ స్థలాన్ని ఆక్రమించింది. టేబిల్ మీది వేస్‌లో గులాబిపూలు నవ్వుతున్నాయి. కుర్చీలు గూడా శిక్షణ నేర్చుకొన్నాయ్.

తెల్లవారు ఝామునే లేచాడు. అమెరికా రేజరులో కొత్తబ్లేడు తగిల్చి, మృదువుగా గడ్డంచేసుకొన్నాడు. క్రొపునున్నగా వుంది. అద్దానికి పనితగిలింది. ఎవరో చేయమంటున్నారు. యీ పనులన్నీ; తను చేస్తున్నాడు. అంతేనా! వెనక బొంబాయిలో కుట్టించిన గీరల సూటు వేసుకొన్నాడు. నిన్ననే తెచ్చిన కొత్త “టై” తగిల్చాడు. ఈల వేశాడు. పాడేడు. లక్ష్యం లేకుండా గదిలో తిరిగాడు. కూని రాగం. తీశాడు గొలుసులలో నిర్మించిన నావుయ్యేల విరిగినమ్రోళలా అది? నిస్పృహనిచ్చిన మెల్లైక్కావనీ అని ఆశుకవిత్వం చెప్పసాగాడు. జేమ్సు. హెచ్. కజిన్సుకవిస్మృతికి వచ్చాడు. “అసంఖ్యాకమైన సంవత్సరాలలో నేను ఎన్నో వసంతాలను చూడగలను.”

* * *

“వస్తుంది. సావిత్రి; వుషఃకిరణంలా వస్తున్నది.”—స్టేషనువేపు జోరుగానడిచాడు. టాక్సీ అద్దెకు కుదిర్చాడు. పాసెంజరు వచ్చింది. ప్లాట్ ఫారమంతా కన్నులుచేసుకువెతికాడు. ఎవరికోసమూ నిరీక్షిస్తూన్న యువతి, ఎవ్వరూ కనబడలేదు. అరగంటలో ప్లాట్ ఫారమంతా నిర్మానుష్యం “బండి తప్పివుంటుంది. అయ్యో పాపం” అన్నమాటలు వెలువడ్డాయ్, పెదిమలనుండి.

మరొక ముప్పావుగంటలో గది ఛాయలకు వచ్చాడు. మేడ గది వరండాలో ఎవరో నలభై అయిదేళ్ళ పెద్దమనిషి కూర్చుని, సంచిని వెతుక్కుంటూన్నాడు-“నమస్తే—మీరేనా రచయిత” ఫలానివారు? అని “మీరు—”అన్నాడు.

ఆయన చిరునవ్వుతో—“నేనే సావిత్రిని—పెద్దగా నవ్వాడు. తనకు ముచ్చెమటలు పోశాయ్, కళ్ళముందు ఏదో భయంకర సర్పం కనిపించినట్లయింది. ఎక్కడికో కాళ్ళు ఎగిరి పోతున్నాయ్. పిట్టగోడమీదుగా దూరపు సముద్రం అరఫర్లాంగులో ఘోషిస్తున్నది. చెవులనిండా పెద్దఘోష. చీకటిలో తడుముకొన్నట్లు పిట్టగోడ తాకి చూశాడు. పెద్ద వెలగా కనిపించింది.

ఆపెద్ద మనిషి — ఆ నలభైఅయిదేళ్ళ పెద్ద మనిషి మళ్లీ పిలిచాడు—“ఏమండీ!”

“ఛీ ఛీ—సావిత్రి—మీరేనా?” అన్నాడు తను.

“అవును” మళ్ళీ చిరునవ్వుతో జవాబు.

“తనుచేతులు రెండూ పైకెత్తాడు. పెద్దగా భీషణంగా వికటంగా అట్టహాసం చేశాడు. సావిత్రి చెయ్యమన్నది గనక చేశాడు. నిన్నటి సావిత్రి, ఊర్వశి నృత్యంచేసింది. నేటి సావిత్రి వికటాట్టహాసం చేస్తుంది. నిన్నటి సావిత్రి “వూహ” నేటి సావిత్రి “భౌతికం”

పిట్టగోడను ఒక్క వుదుటులో లంఘించాడు. క్రింద యిసికమీదపడి లేచి పరుగెత్తసాగాడు. బజారులో—అంతా నివ్వెరపోయి చూస్తున్నారు.

ఆ పెద్దమనిషి పిలుస్తున్నాడు. “అయ్యో, అదేమిటండీ—అయ్యో, అయ్యో—”

తను వెనుదిరగలేదు. తనను సముద్రం ఘోషతోనే పిలిచింది!!